ఊటీని తలపించేలా.. కృష్ణానదిలో విహారానికి సిద్ధంగా ఉన్న బోట్లు



సింగోటం, సోమశిల వద్ద కాటేజీలు

ట్రెక్కింగ్ చేయాల్సిందే..

అంతెత్తు మీదున్న అంకాలమ్మను దర్శించుకోవాలంటే 600 మీటర్ల ఎత్తు ఉన్న కొండపైకి ట్రెక్కింగ్ చేయాల్సిందే. కోటపై నుంచి చీమలతిప్పను చూస్తే ద్వీపంలోని మనుషులు చీమల్లానే కనిపిస్తారు. శత్రు దుర్భేద్యంగా 10 అడుగుల ఎత్తుతో, 5 అడుగుల వెడల్పుతో కొండ చుట్టూ కట్టిన పటిష్ఠమైన రాతి గోడ చైనా వాల్‌ను తలపిస్తుంది. ఇక్కడ అమ్మవారు శాంతి స్వరూపిణిగా కొలువుదీరారు. కొండపై బావిలో ఎల్లప్పుడూ నీళ్లు పుష్కలంగా ఉంటాయి. గత చరిత్రకు ఆధారాలుగా శిలాశాసనాలు కూడా ఉన్నాయి. ఈ కోట చాళుక్యుల కాలం నాటిదని అంటారు.

కాటేజీల సోయగం

సోమశిలలో ప్రైవేట్ గెస్ట్‌హౌస్‌లతో పాటు టూరిజం శాఖ కాటేజీలూ ఉన్నాయి. లాంచి, బోటింగ్ సౌకర్యం ఉంది. క్యాంప్ ఫైర్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. సింగోటం వద్ద సైతం కాటేజీలు నిర్మించారు. మంచాలకట్ట దగ్గర కృష్ణానది సముద్రాన్ని తలపించే అనుభూతి ఇస్తుంది. ఇక్కడికి వలస పక్షులు భారీ సంఖ్యలో వస్తాయి. హైదరాబాద్ నుంచి నాగర్ కర్నూల్ మీదుగా కొల్లాపూర్ చేరుకోవచ్చు. ఇక్కడినుంచి ఎనిమిది కిలోమీటర్ల దూరాల్లో ఉన్న అమరగిరి, సింగోటం, సోమశిల, జటప్రోలు వెళ్లడం పెద్ద కష్టమేం కాదు. ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేట్ వాహనాలూ అందుబాటులో ఉన్నాయి.

చూడాల్సిందే..

ఇక, కొల్లాపూర్ పరిసర ప్రాంతాల్లో చూడదగిన ప్రదేశాల్లో.. జటప్రోలు సంస్థానం, కొల్లాపూర్ పట్టణంలోని మాధవస్వామి ఆలయం, చంద్రమహల్, రాణీమహల్, మంత్రమహల్, సింగపట్నంలోని శ్రీవారి సముద్రం, తీరంలో నెలకొన్న లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, లక్ష్మీదేవమ్మ గుట్ట, సోమశిలలోని లలితాసోమేశ్వర ఆలయం, శ్రీవేంకటేశ్వర ఆలయం ముఖ్యమైనవి. కొల్లాపూర్ సంస్థానానికి నిజాం, బ్రిటిష్ పాలనలో ప్రత్యేక స్థానం ఉండేది. సురభి రాజుల కాలంలో నిర్మితమైన కట్టడాలు నాటి వైభవానికి ప్రతీకలు. హైదరాబాద్ నగర వాసులు వారాంతంలో ప్లాన్ చేసుకుంటే.. శ్రీశైల మల్లికార్జునుడి దర్శనమూ అవుతుంది. ■

... జి. నాగశేషయ్య

గోపి

కృష్ణానది మధ్యలో ఉన్న చీమలతిప్ప ద్వీపంలో ఆంధ్రా జాలర్ల నివాసాలు